సాక్షి ఆదిలాబాద్

ఆదివారం। 25। ఆగస్టు। 2024

మెప్మా పీడీగా మమత

కైలాస్‌నగర్: మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మమత నియామకమయ్యారు. ఎస్‌ఐయూజీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను ఆదిలాబాద్‌కు బదిలీ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమె కలెక్టర్ రాజర్షి షా ను కలిసి రిపోర్టు చేశారు. ఇన్‌చార్జి పీడీగా ఉన్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అందుబాటులో లేకపోవడంతో బాధ్యతలు స్వీకరించలేదు.

జూడాల సమ్మె విరమణ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె విరమించినట్లు జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి తెలిపారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని దారుణ హత్యను నిరసిస్తూ 11 రోజులుగా సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు అప్పీల్, ఆదేశాలకు ప్రతిస్పందనగా సమ్మె విరమించినట్లు ఆయన పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రీయ బాల పురస్కార్‌కు నామినేషన్ల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రపతి, ప్రధానమంత్రి చేతుల మీదుగా ఏటా బాలలకు అందించే రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటక్షన్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఆరు కేటగిరీల్లో (ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ఎన్విరాన్‌మెంట్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్, సైన్స్ అండ్ టెక్నాలజీలో) పురస్కారాలు ఉంటాయని పేర్కొన్నారు. 5 నుంచి 18 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దేశం కోసం, ఇతరుల జీవితాల కోసం రక్షణ చూపిన సాహసాన్ని ప్రస్తావిస్తూ awards. gov. in వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు బాలరక్ష భవన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. రిమ్స్‌లో గల సంఘ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పార్క్ కాంట్రాక్టర్ సెక్యూరిటీ గార్డులు, పేషెంట్ కేర్‌ల ఐదు నెలల పెండింగ్ వేతనాలు, ఏరియర్స్ చెల్లించడం లేదన్నారు. ఈ విషయమై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ ముత్యంరెడ్డికి వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. ఇందులో సంఘం నాయకులు ముజీబ్, సైఫ్‌ఖాన్, అమీర్ పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కైలాస్‌నగర్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఆరోగ్యమందిర్ కార్యక్రమంలో భాగంగా పలు పోస్టుల భర్తీ కోసం కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి అనంతరం ఎంపికైన వారికి పోస్టింగ్ ఇచ్చారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా నలుగురిని ఎంపిక చేశారు. తలమడుగులోని దేవాపూర్, పిట్టబొంగరంలోని వాల్గొండ, గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్, ఇచ్చోడ మండలంలోని బోరిగామ పోస్టులను భర్తీ చేశారు. అలాగే ఉట్నూర్ జిల్లా ఆసుపత్రి లో నలుగురు స్టాఫ్‌నర్సులను నియమించారు. జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌లో ఫార్మాసిస్టు పోస్టును భర్తీ చేశారు. ఈ ప్రక్రియలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అ ధికారి కృష్ణ, డీఎస్సీడీవో సునీతా కుమారి, సూపరింటెండెంట్ గోపి తదితరులున్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో శనివారం పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కూలర్లు, పాత టైర్లు, తదితర వాటిలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఆయన వెంట మలేరియా నివారణ అధికారి శ్రీధర్, తదితరులున్నారు.

ఐడీ పార్టీ పోలీసులకు రివార్డులు



రివార్డు అందజేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: కేసులు త్వరితగతిన ఛేదించిన ఐడీ పార్టీ పోలీసులను ఎస్పీ గౌస్ ఆలం శనివారం ప్రత్యేకంగా అభినందించారు. క్యాంప్ కార్యాలయంలో వారికి రివార్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. టూటౌన్‌లో పనిచేస్తున్న క్రాంతికుమార్, ఆర్‌ఎస్ రమేశ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గతేడాది డిసెంబర్ నుంచి ఈనెల ఆగస్టువరకు రెండు గంజాయి కేసులు, 17 చోరీ, మూడు రాబరి కేసులను ఛేదించినట్లు తెలిపారు. 24 గంటల్లో కొన్ని దొంగతనాల కేసులను ఛేదించగా, మరి కొన్ని వారంలోపే పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయికి సంబంధించి రూ.లక్ష 40వేల వరకు స్వాధీనం చేసుకోగా, 17 దొంగతనం కేసులకు సంబంధించి దాదాపు రూ.7లక్షల వరకు రికవరీ చేసినట్లు వివరించారు. అలాగే రాబరి కేసులకు సంబంధించి ఆటోలు, టూవీలర్లు, సెల్‌ఫోన్లు, తదితర వాటిని స్వాధీనం చేసినట్లు చెప్పారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించడంపై అభినందించారు.



జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

లక్కీ గృహం.. అందేనా?



లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా తీస్తున్న అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

- ఏడాది దాటినా తప్పని ఎదురుచూపు
- ఇళ్ల కేటాయింపుపై అధికారుల్లో స్పష్టత కరువు
- జిల్లాలో ఎంపికైన 'డబుల్' లబ్ధిదారుల పరిస్థితి

మున్సిపల్ పరిధిలో 'డబుల్ బెడ్‌రూం' పథకం వివరాలు
ఇళ్ల కోసం అందిన మొత్తం దరఖాస్తులు: 9,486
విచారణలో తేలిన అర్హుల సంఖ్య: 3,179
అనర్హులుగా నిర్ధారించిన వారి సంఖ్య: 6,307
కేటాయింపునకు సిద్ధంగా ఉన్న ఇళ్లు: 982
ఇళ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య: 618

కైలాస్‌నగర్: సొంతిల్లు లేని నిరుపేదలకు ఇంటి వసతి కల్పించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆదిలాబాద్ పట్టణంలోని పేదల కోసం పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, మావల మండలకేంద్రంలోని సర్వేనంబర్ 170లో ఈ ఇళ్లను నిర్మించారు. మౌలిక వసతులు మినహా నిర్మాణాలు పూర్తి కావడంతో లబ్ధిదారులకు కేటాయింపు చర్యలు చేపట్టారు. గతేడాది మే 9న లక్కీడ్రా నిర్వహించిన అధికారులు 618 మందిని ఎంపిక చేశారు. ఇక

ఈ పథకంలో భాగంగా పట్టణంలో అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించారు. కేఆర్‌కే కాలనీ సమీపంలో 760, మావల బైపాస్ జాతీయ రహదారిని అనుకుని 222 ఇళ్లను నిర్మించారు. కేఆర్‌కే కాలనీలోని ఇళ్లు కలరింగ్‌తో సిద్ధమవ్వగా మావలోని ఇళ్లకు రంగులు వేయలేదు. మౌలిక వసతులు మినహా మిగతా పనులు పూర్తవడంతో 982 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గాను గతేడాది మే 9వ అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించారు. 618 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఎంపికైన వారంతా సంబరపడ్డారు. అయితే ఏడాది గడిచినా ఇంకా ఇళ్ల కేటాయింపు చేపట్టకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

618 మంది ఎంపిక

తమ కష్టాలు తీరుతాయని వారంతా సంబరపడ్డారు. అయితే వారి అదృష్టం అవిరైపోయింది. ఏడాది దాటినా ఇళ్ల కేటాయింపు చేపట్టకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ సభల ద్వారా అర్హుల ఎంపిక

డబుల్ బెడ్‌రూం పథకంలో భాగంగా 2016 నుంచి బల్దియా, రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇలా అందిన దరఖాస్తుల ఆధారంగా గతేడాది ఫిబ్రవరి నుంచి మార్చి 19 వరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఏప్రిల్ 4నుంచి 6వరకు పట్టణ పరిధిలో వార్డుల వారీగా గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. రెండు రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితా సిద్ధం చేశారు.

కేటాయింపుపై స్పష్టత కరువు

ఇక ఇళ్ల కేటాయింపే తరువాయి అనుకున్నారు ఎంపికైన లబ్ధిదారులు. అయితే అదృష్టం వరించినా అధికారులు కరుణించని చందంగా మారింది వారి పరిస్థితి. ఏడాది దాటినా ఇళ్లు కేటాయించకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఈ క్రమంలో ఇళ్ల కేటాయింపుపై అటు రెవెన్యూ, ఇటు హౌసింగ్ శాఖలకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు అందలేదు. దీంతో కేటాయింపు ప్రక్రియ సందిగ్ధంగా మారింది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తారా లేక కొత్త వారిని ఎంపిక చేస్తారా.. లేదా మళ్లీ ప్రక్రియను కొత్తగా చేపడుతారా అనేదానిపై అధికార వర్గాల్లోనూ స్పష్టత లేదు.

విచారణకు ఆదేశాలు అందాయి

ఇది వరకు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో అందులో అర్హుల ఎంపికకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దానిపై కసరత్తు చేస్తున్నాం. అయితే గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపునకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయం నాకు తెలియదు. పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా తగు చర్యలు తీసుకుంటాం.

– టి.వినోద్ కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్

- సస్పెన్షన్‌కు సిఫారసు
- డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసిన ఉన్నతాధికారులు

జిల్లా డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జి సరెండర్



డ్రగ్ స్టోర్‌ను పరిశీలిస్తున్న టీజీఎంఐడీసీ జీఎం ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో కృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన జిల్లా కేంద్రంలోని డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జి, ఫార్మాసిస్టు యు.విఠల్‌పై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. ఏ 'మాత్ర'ం శ్రద్ధ లేదు.. శీర్షికన 'సాక్షి' మెయిన్‌లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఐడీసీ) జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి డీఎంహెచ్‌వో కృష్ణతో కలిసి రిమ్స్ ఆవరణలో గల డ్రగ్ స్టోర్ ను తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులపై విచారణ చేపట్టారు. ఆడిటోరియంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మందులు, ఎలుకలు ధ్వంసం చేసిన వాటిని పరిశీలించారు. డ్రగ్‌స్టోర్ నిర్వహణ లోపభూయిష్టంగా ఉన్నట్లు గుర్తించారు. బాధ్యుడైన విఠల్‌ను డీఎంహెచ్‌వోకు సరెండర్ చేస్తూ జీఎం ఆదేశించారు. అలాగే ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని పేర్కొంటూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సిఫారసు చేశారు. లక్షలాది రూపాయల విలువైన మందులను భద్రపర్చడంలో నిర్లక్ష్యం వహించడం, పీహెచ్‌సీలు, ఆసుపత్రులకు సరఫరా చేయడంలోనూ పట్టింపులేనితనంగా వ్యవహరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఈ ఘటన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

కొత్త రెవెన్యూ చట్టంతో పేదలకు మేలు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్ అభిప్రాయం
- ధరణి సమస్యల పరిష్కారం కోసమేనని కలెక్టర్ వెల్లడి
- ముసాయిదా రెవెన్యూ చట్టంపై అభిప్రాయాల స్వీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న నూతన రెవెన్యూ చట్టం పేదలు, రైతులకు మేలు చేసేలా ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అభిప్రాయపడ్డారు. ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం–2024పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం చర్చా వేదిక నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్త చట్టంతో సేవలు సులభంగా వేగంగా అందడంతో పాటు రెవెన్యూ వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టను తీసుకురానుందన్నారు. అనంతరం నూతన ముసాయిదా చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వివిధ వర్గాల వారి నుంచి సేకరించిన అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవోలు వినోద్ కుమార్, జీవాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, మీసేవ కేంద్రాల నిర్వాహకులు,తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'పీఎస్సార్'కు ఖాయమేనా?

- మంత్రివర్గంలోకి మంచిర్యాల ఎమ్మెల్యే
- ఆయనకే బెర్త్ అంటున్న అనుచర వర్గం
- జిల్లా నుంచే పోటీలో 'గడ్డం' బ్రదర్స్



శనివారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ రెండో విడత చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు(పీఎస్సార్)కు బెర్త్ ఖాయమని ఆయన అనుచర వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. మొదటి విడతలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం కల్పించలేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో ఒకరికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో గత కొంత కాలంగా రెండో విడత మంత్రివర్గ విస్తరణలో పీఎస్సార్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పీసీసీ అధ్యక్ష పదవితోపాటు నామినేటెడ్ పోస్టులు, కేబినెట్ విస్తరణ జరుగుతుందనే నేపథ్యంలో పీఎస్సార్ అనుచర వర్గం ఆశలు పెట్టుకుంది. మరోవైపు జిల్లా నుంచే బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్ పోటీలో ఉన్నారని వారి అనుచరులు చెప్పుకుంటున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ఎమ్మెల్యే పీఎస్సార్ కలిశారు. కాంగ్రెస్ అధిష్టానం వద్ద రాష్ట్ర కీలక నాయకులంతా ఉండడంతో మంత్రివర్గ కూర్పులో స్థానిక ఎమ్మెల్యేకు స్థానం ఖాయమైనట్లు ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. అంతేగాక రాష్ట్ర మంత్రివర్గం నుంచి ఎమ్మెల్యే పీఎస్సార్‌కు అండ కూడా ఉండడంతో ఆయనకే అవకాశాలు మెండుగా ఉన్నట్లు చెబుతున్నారు.

ఈ నెల 28న ప్రకటన?

మంత్రివర్గ విస్తరణలో జిల్లా నుంచి ఎవరికి అవకాశం ఉంటుందోనని ఈ నెల 28న ప్రకటన రావొచ్చని సమాచారం. ఈ క్రమంలో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎవరికి స్థానం కల్పించారో దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. పోటీలో ఉన్నవారిని నచ్చజెప్పడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సామాజిక సమీకరణాలను దృష్టి పెట్టుకుని అధిష్టానం ఆలోచిస్తున్న క్రమంలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందోనని టెన్షన్ నెలకొంది. మరోవైపు 'గడ్డం' సోదరులు సైతం తమకే పదవి దక్కాలంటూ ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్న తరుణంలో అధికారికంగా వెలువడే వరకు అధికార పార్టీ కేడర్‌లో ఆసక్తి నెలకొంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణ

- ఎస్పీ గౌస్ ఆలం



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో శనివారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను (హాట్‌స్పాట్స్) గుర్తించాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు హైవేలపై రంబుల్ స్ట్రిప్స్, వేగ నియంత్రణ బోర్డులు, హాట్‌స్పాట్‌లలో జిగ్జాగ్ పద్ధతులను పాటించాలన్నారు. అలాగే డయల్ 100పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫోన్ చేసిన బాధితుల వద్దకు సత్వరం చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి విక్రయించేవారితోపాటు అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పట్టణాలు, మండలాల వారీగా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లావ్యాప్తంగా వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 70 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు అందజేసి అభినందించారు. ఇందులో డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, బి.సురేందర్‌రెడ్డి, సీహెచ్. నాగేందర్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కిరణ్‌కుమార్ రెడ్డి, పీపీలు రమణారెడ్డి, నవీన్‌కుమార్, శ్రీధర్, పోలీసు కార్యాలయ ఏవో భక్త ప్రహల్లాద, జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, కమ్యూనికేషన్, ఎస్‌బీ పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో.. ఎల్‌ఆర్‌ఎస్

- ఇక పంచాయతీల్లోనూ దరఖాస్తుల పరిశీలన
- జీపీ కార్యదర్శులకు ఇప్పటికే పూర్తయిన శిక్షణ
- రేపటి నుంచి క్షేత్రస్థాయి ప్రక్రియ

జిల్లాలో..
మొత్తం గ్రామ పంచాయతీలు : 468
ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు అందిన పంచాయతీలు : 62
అనధికార అక్రమ లేఅవుట్లు : 280
అనధికార ప్లాట్లు : 10,577
సర్వే అధికారులు : 62



పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణలో డీటీసీపీవో, డీఎల్‌పీవో

కైలాస్‌నగర్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ ఇక పల్లెల్లోనూ షురూ కానుంది. ఈ మేరకు యంత్రాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన కోసం రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులను పంచాయతీ శాఖ ఇప్పటికే ఎంపిక చేసింది. వారికి శిక్షణ కూడా అందజేసింది. పరిశీలన విధానం, యాప్‌లో జియో లోకేషన్ నమోదు చేయాల్సిన తీరుపై వారికి అధికారులు, ట్రైనర్స్ అవగాహన కల్పించారు. ప్రత్యేక లాగిన్, యూజర్ ఐడీలను సైతం కేటాయించారు. సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రారంభం కానుంది.

బేల, ఇచ్చోడ మండలాల్లో అత్యధికం

జిల్లాలో 62 పంచాయతీల్లో మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు అందాయి. ఇందులో అత్యధికంగా బేల మండల కేంద్రంలో 1,718 దరఖాస్తులు రాగా, ఇచ్చోడ మండలం అడెగామ(బి)లో 1,175 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద-టిలో 192, భీంసరిలో 40, బోథ్ మండలంలోని బోథ్‌లో 795, కన్నుగట్టలో 35, కొటలో 76, కుచులాపూర్‌లో 16, పొచ్చెరలో 156, బజార్‌హత్నూర్ మండలంలోని బజార్‌హత్నూర్‌లో 270, దేగామలో 60, గిర్నూర్‌లో 102, బేల మండలం సిర్సన్నలో 38, గుడిహత్నూర్ మండలంలోని గోండ్‌హర్కాపూర్‌లో 63, గుడిహత్నూర్‌లో 70, మల్కాపూర్‌లో 16, మన్కాపూర్‌లో 44, మన్నూర్‌లో 23, సీతాగొందిలో 127, శాంతాపూర్‌లో 80 చొప్పున దరఖాస్తులు అందాయి. ఇచ్చోడ మండలం అడెగామ(కే)లో 935, ఇంద్రవెల్లి మండలం దన్నూర్‌లో 66, ఇంద్రవెల్లి(బి)లో 401, కేస్లాపూర్‌లో 115, జైనథ్ మండలం దీపాయిగూడలో 52, లేఖర్‌వాడలో 22, మాండగడలో 54, నిరాలలో 24, మావల మండలం బట్టిసావర్‌గాంలో 904, మావలలో 914, నేరడిగొండ మండలం కుమారిలో 20, లఖంపూర్‌లో 116, నేరడిగొండలో 182 వడూర్‌లో 30, వాంకిడిలో 42 సిరికొండ మండల కేంద్రంలో 205, తలమడుగు మండలంలోని భరంపూర్‌లో 15, దేవాపూర్‌లో 19, కజ్జర్లలో 33, కుచులాపూర్‌లో 75, పల్లికేలో 35, తాంసి మండలంలోని హస్నాపూర్‌లో 22, కప్పర్లలో 82, పొన్నారిలో 335, ఉట్నూర్ మండలంలోని లక్కారంలో 177, ఉట్నూర్‌లో 351 దరఖాస్తులు రాగా లింగోజి తండాలో 149 దరఖాస్తులు అందాయి.

62 మంది పరిశీలన అధికారులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన 62 మంది ఎల్–1 అధికారులు పరిశీలించనున్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొననున్నారు. వీరికి ఎల్‌ఆర్‌ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన చేసే విధానం ప్రత్యేక ఎల్‌ఆర్‌ఎస్ యాప్–2020లో జియో లోకేషన్ నమోదు విధానంపై ఆయా శాఖల ఆధ్వర్యంలో ఇది వరకే శిక్షణ అందించారు. పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం డీటీసీపీవో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. వారందరికీ ప్రత్యేక యూజర్ ఐడీ, లాగిన్లను కేటాయించారు. సోమవారం నుంచి వీరంతా క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తులు పరిశీలించనున్నారు.

పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు..

పంచాయతీల్లోనూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. సోమవారం నుంచి క్షేత్రస్థాయి ప్రక్రియ షురూ కానుంది. జిల్లాలో 62 పంచాయతీల్లో మాత్రమే దరఖాస్తులు అందాయి. 2020 సంవత్సరంలో మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను మాత్రమే ప్రస్తుతం పరిశీలించనున్నాం. క్షేత్రస్థాయి పరిశీలన కోసం వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సంబంధిత డాక్యుమెంట్స్ అందజేసి ప్రక్రియకు సహకరించాలి.

– శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

పార్టీ పటిష్టతే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఆదిలాబాద్: పార్టీ పటిష్టతే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అయినప్పుడే అన్ని స్థాయిల్లోనూ సమన్వయం సాధ్యమవుతుందన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత దృఢంగా చేయాలనే ఉద్దేశంతో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో ఎమ్మెల్యే పాయల్ శంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, మయూర్ చంద్ర, వేణుగోపాల్, రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంజనీరింగ్ విద్యలో నాలుగేళ్లు కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకుడు

బాసర: ఇంజనీరింగ్ విద్యలో నాలుగేళ్లు కీలకమని ఆర్జీయూకేటీ అధ్యాపకులు డాక్టర్ చంద్రశేఖర్‌రావు, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు శనివారం ఆర్జీయూకేటీలో ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో రాణించేందుకు నైపుణ్యం అలవర్చుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక విద్యారంగంలో అనేక మార్పులు, చేర్పులు రావడాన్ని గమనిస్తూ ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. సమన్వయ కర్త కిరణ్‌కుమార్, ఈసీఈ డిపార్టుమెంట్ అధ్యాపకులు రాధాకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ముధోల్: మండల కేంద్రంలోని మార్కండేయ వీధిలో గల మేదరోల్ల వెంకటేశ్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వెంకటేశ్ శుక్రవారం ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం వచ్చి చూడగా తాళం పగల గొట్టి మరో తాళం వేసిఉన్నట్లు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న రూ. 1.6 లక్షల నగదు, 7తులాల బంగారం చోరీకి గురైనట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సందర్శించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు

దస్తురాబాద్: హెచ్‌పీ సిలిండర్‌లో గ్యాస్ తక్కువగా వస్తుందని మండల కేంద్రానికి చెందిన సాయికుమార్, అభిలాష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తూనికలు కొలతల శాఖ అధికారులకు సమాచారం అందించారు. తూనికలు, కొలతల శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి భూలక్ష్మి శనివారం మండల కేంద్రానికి వచ్చిన 63 గ్యాస్ సిలిండర్లను తనిఖీ చేశారు. సిలిండర్లలో గ్యాస్ తక్కువగా ఉండడంతో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని భూలక్ష్మి తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- పంట చేనులో పశువులను మేపారని అఘాయిత్యం



మేపేసిన పత్తి చేనులో రైతు దంపతులు

కుంటాల: మండలంలోని అంబకంటి తాండా పంచాయతీ పరిధిలోని రాయపాడ్ తండాకు చెందిన రైతు జ్ఞానేశ్వర్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. జ్ఞానేశ్వర్ మూడెకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. గుర్తించిన అధికారులు శనివారం పంటను గొర్రెలు, మేకలను పంపి మేయించారు. దీంతో మనస్తాపం చెందిన రైతు పంట చేనులోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. భైంసా డీఆర్వో శంకర్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. గతంలో జ్ఞానేశ్వర్ హక్కు పత్రాలు లేకున్నా అటవీ భూమి సాగు చేశాడన్నారు. దీంతో నోటీసులు ఇచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మళ్లీ అటవీ భూమే సాగు చేస్తున్నాడని పేర్కొన్నారు.

అద్దెకు దొరకని అరక

- యాంత్రీకరణ పెరిగినా.. అరకతోనే కలుపుతీత
- కాడెద్లు తగ్గడంతో అరక కూలీకి మస్తు డిమాండ్
- పత్తి చేలల్లో కలుపు నియంత్రణకు రైతుల పాట్లు



పత్తి చేనులో కాడెద్లతో దౌరకొడుతున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలో యంత్రసాగు పెరిగింది. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో కాడెద్లు కనుమరుగయ్యాయి. గత నెలలో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు పంటచేలలో కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు ప్రస్తుతం పంటచేలలో కలుపుతీత పనుల్లో బిజీగా మారారు. కలుపు నియంత్రణకు కూలీలతో పాటు దౌర కొట్టేందుకు అరకల కోసం వెంపర్లాడుతున్నారు. దీంతో కాడెద్లు ఉన్న అరక కూలీ రైతులకు డిమాండ్ పెరిగింది. దుక్కి దున్నడంతో మొదలు, పంట ఇంటికి చేర్చే వరకు ట్రాక్టర్ల వినియోగం పెరిగినా ఒకదశలో రైతులకు కాడెద్ల అవసరం తప్పడంలేదు. ఎన్ని యంత్రాలు ఎన్ని వచ్చినా అరకసాగుకు మాత్రం డిమాండ్ తగ్గడంలేదు. పత్తి విత్తనాలు విత్తాలన్నా అరకతో సాళ్లు పట్టాల్సిందే. పత్తిలో కలుపు నివారణకు అరకతో దౌర కొట్టాల్సిందే. నారుమడి కలియ దున్నాలంటే అరక కావాల్సిందే. నాటు వేసేందుకు జంబు కొట్టాలన్నా కాడెద్ల అవసరం తప్పనిసరి అంటున్నారు రైతులు.

అరకకు రూ.2,200 డిమాండ్

ఉమ్మడి జిల్లాలో 17.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతుండగా ఇందులో ప్రధానంగా పత్తి, వరి సాగు అవుతోంది. గత నెలలో కురిసిన వర్షాలకు పత్తిచేలలో కలుపుమొక్కలు విపరీతంగా పెరిగాయి. వారం రోజులుగా ఎండలు కొడుతుండడంతో రైతులంతా కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. ఆలస్యమైతే పంట ఎదుగుదల లేకుండా పోతుంది. మళ్లీ వర్షాలు కురిస్తే కలుపు తీయడం, ఎరువులు వేసుకోవడం కుదరదు. దీంతో ఇటు కూలీలలతో పాటు అటు దౌరకొట్టేందుకు అరక కోసం వెంపర్లాడుతున్నారు. డిమాండ్ పెరగడంతో అరక కూలి రోజుకు రూ.2 వేల నుంచి రూ.2,200 తీసుకుంటున్నారు. అయినా అరక దొరకడం లేదని రైతులు వాపోతున్నారు.

గ్రామాల్లో తగ్గిన కాడెద్లు..

ఒకప్పుడు ఏ రైతు ఇంటిముందు చూసినా కాడెద్లు, ఎడ్లబండ్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం 70 శాతం మంది రైతుల ఇళ్లముందు ఎడ్లబండ్లకు బదులు ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా దిగుబడులు పెంచుకోవడం, శ్రమ తగ్గించుకోవడం, సమయం ఆదా చేసుకునేందుకు యంత్రాల సాగు చేస్తున్నారు. చేను చదును కాడి నుంచి దిగుబడి వచ్చిన పంట అమ్మకానికి మార్కెట్‌కు తరలించే వరకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. దీంతో కాడెద్లకు మేతతో పాటు వాటి ఆలనాపాలన చూసుకోవడం వీలుకావడం లేదని చాలామంది రైతులు ఎడ్లను అమ్ముకుని ట్రాక్టర్లు విక్రయించేందుకు ముందుకు వస్తున్నారు. కానీ ఒకానొకదశలో వాటి అవసరం తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పత్తి చేలలో చెట్లమధ్య దౌరకొట్టాలంటే ట్రాక్టర్లతో వీలుకాదు. చెట్లు విరిగిపోవడం, టైర్ల కిందపడి నలిగిపోవడం జరుగుతుంది. అంతేకాకుండా వర్షాలకు చేన్లు బురదమయం అవుతున్నాయి. ఈ సమయంలో కాడెద్లతో దౌరకొట్టడం సులభతరంగా ఉంటుందని రైతులు అరకనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఆలస్యమైతే పంట ఎదగదు..



గత నెలలో కురిసిన వర్షాలకు పత్తిలో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. అరక అయితే సాళ్ల మధ్యలో ఉన్న గడ్డిపోతుంది. ట్రాక్టర్‌తో అయితే చెట్లు ఇరుగుతై. గతంలో కాడేద్లు ఉండే. వాటిని అమ్మి ఇప్పుడు అరక కోసం తిరుగుడైతంది. ఆలస్యమైతే గడ్డి పెరిగి పంట ఎదగదు.

– జాపాతి కొమురయ్య, నెన్నెల

ముందే పైసలిచ్చిపోతుండ్రు



పత్తి విత్తనాలు విత్తడానికి సాళ్లు పెట్టేందుకు, వరి నారుమడి సిద్ధం చేయడానికి, పత్తిలో కలుపు నివారణకు దౌరలు కొడుతున్నాం. మా వాడలో మాకే ఎడ్లు ఉండడంతో దౌరకొట్టడానికి రైతులు ఎక్కువగా అడుగుతున్నారు. అరకకు రావాలని నాలుగు రోజుల ముందే పైసలు ఇచ్చి పోతుండ్రు.

– భీమరాజుల పవన్, నెన్నెల

కవలలకు జన్మనిచ్చి తల్లి అనంతలోకాలకు

- గుండెపోటుతో బాలింత మృతి



దీక్ష (ఫైల్)





తల్లిని కోల్పోయిన కవల పిల్లలు

ఇంద్రవెల్లి: ఇద్దరు కవలలకు జన్మనిచ్చి తల్లి అనంతలోకాలకు వెళ్లిన సంఘటన మండలంలోని అందునాయక్ తాండలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వాగ్మరే దీక్ష (28)కు ఈ నెల 22న మూడోకాన్పులో పురిటి నొప్పులు రావడంతో భర్త గోవింద్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 23న సిజేరియన్ ద్వారా ప్రసవం చేయగా మగ కవలలకు జన్మనిచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే శనివారం గుండెపోటు రావడంతో మృతి చెందింది. పుట్టుకతోనే తల్లిని కోల్పోయిన కవలలను చూసి బంధువులు కంటతడి పెట్టారు. అందునాయక్‌తాండలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలింత మృతి



జల్‌కర్ దేవి (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన బాలింత జల్‌కర్ దేవి (20) శుక్రవారం రాత్రి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. జలకర్ దేవి ఐదు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శుక్రవారం వైద్యులు డిశ్చార్జ్ చేయగా అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ విషయంపై మండల వైద్యాధికారి సర్ఫరాజ్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా మృతికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా మృతురాలి భర్త వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో శ్రీ విఘ్నేశ్వరా యూత్ సభ్యులు ఆర్థిక చేయూత అందించారు.

అయోధ్య రామయ్యకు ఉడతా భక్తిగా..

- బియ్యపు గింజలతో తీర్చిదిద్దిన కళాఖండం అందజేత
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందించిన నిర్మల్ కళాకారుడు రాజేంద్ర



అయోధ్య రామాలయంలో తాను రూపొందించిన చిత్రాన్ని ప్రదర్శిస్తున్న రాజేంద్ర

నిర్మల్‌ఖిల్లా: ప్రతీ వ్యక్తిలో కళ దాగిఉంటుంది. అలాంటి విభిన్న శైలే నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బిట్లింగు రాజేంద్రది.. సూక్ష్మచిత్రకళ (మినీయేచర్ ఆర్ట్) అని పిలిచే ఈ రంగంలో అద్భుత నైపుణ్యంతో అనేక రకాల చిత్రాలు, దేవుని ప్రతిమలు తీర్చిదిద్దాడు. అయోధ్య శ్రీరామ జన్మభూమి పునః ప్రతిష్టాపన సమయంలో శ్రీరాముడి చిత్రపటాన్ని ఆలయంతో సహా బియ్యపు గింజలతో తీర్చిదిద్దాడు. ఆ అయోధ్య రాముడికి ఉడతాభక్తిగా ఆ చిత్రపటాన్ని సమర్పించాడు. చూస్తుంటే మామూలు పెయింటింగ్ లాగా కనిపించే ఈ చిత్రం, తీక్షణంగా పరిశీలిస్తే శ్రీరాముడి ప్రతిరూపం కనిపిస్తుంది. ఇంకా దగ్గరగా పరిశీలిస్తే బియ్యపు గింజలపై తెలుగు, హిందీ, ఆంగ్లభాషల్లో రామ నామం గోచరిస్తుంది. బంగల్‌పేట్ ప్రాంతానికి చెందిన బిట్లింగు రాజేంద్ర అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో ఈ కళాఖండాన్ని తీర్చిదిద్ది ఇటీవల తుదిమెరుగులను పూర్తి చేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య పుణ్యక్షేత్రానికి వెళ్లి శుక్రవారం శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ వారికి తాను రూపొందించిన కళాఖండాన్ని అందజేశాడు. ట్రస్ట్ ఏర్పాటుచేయనున్న మ్యూజియంలో ఈ కళాఖండాన్ని వీక్షకులకు అందుబాటులో ఉంచనున్నట్లు రాజేంద్ర 'సాక్షి'తో తెలిపారు. గతంలో వీరు గీసిన సూక్ష్మచిత్రం హార్వార్డ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది.

ఆర్జీయూకేటీలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



వీణ వాయిస్తున్న శ్రీనివాస్

బాసర: బాసర ఆర్జీయూకేటీ ప్రాంగణంలో శుక్రవారం వీణ విద్వాంసులు డి. శ్రీనివాస్, వయోలెన్ విద్వాంసులు పవన్ సింగ్, మృదంగం విద్వాంసులు బాలసుబ్రహ్మణ్యం తమ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. జాతీయగేయం వందేమాతరంతో మొదలై వాతాపి గణపతిం, తందనాన ఆహే, కొండలలో నెలకొన్న, పలుకే బంగారమాయెనా.. అంటూ సారే జహాసె అచ్చా.. అనే గేయాలతో అందరినీ అలరించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంచడంలో ఎంతో దోహదం చేస్తాయని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ పావని, స్పిక్ మెకే నేషనల్ ఎగ్జిక్యూటివ్ రాకేష్ భట్నాగర్, డాక్టర్ కాలపూర్ణ, తెలంగాణ స్పిక్ మెకే చైర్మన్ ప్రొఫెసర్ గీత, సాంస్కృతిక పాత్రికేయులు నీలు, స్పిక్ మెకే కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి, స్పిక్ మెకే హెరిటేజ్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

భైంసాటౌన్: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాకు గురై ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్‌రోడ్‌లో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టగా ఏపీనగర్‌కు చెందిన బండారి మారుతి (45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన మారుతి తిరిగి రాలేదు. దీంతో అతని కుమారుడు గణేశ్ శనివారం ఉదయం 8.30 గంటలకు భవన నిర్మాణం జరుగుతున్న చోటుకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. చేతిలో విద్యుత్ వైరు ఉండడంతో విద్యుదాఘాతంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. అయితే, సదరు భవన యజమాని విద్యుత్ కనెక్షన్ లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. మృతుని భార్య అర్చన ఫిర్యాదు మేరకు భవన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆహ్వానపత్రిక అందజేత

ఉట్నూర్‌రూరల్: ఈ నెల 29న నిర్వహించనున్న మొదటి గిరిజన శాఖ మంత్రి కోట్నాక భీంరావు వర్ధంతికి రావాలని రాజ్‌గోండ్ సేవాసమితి నాయకులు శనివారం ఐటీడీఏ పీవో కుష్బూగుప్తకు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవాసమితి నాయకులు మంగం విషంరావు, వెడ్మ కొద్దు, గేడం నిరంజన్, ఆత్రం ప్రకాశ్, మడావి బాలాజీ, గుడిపల్లి భీమన్న, ఆత్రం ముకుంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు

బోథ్: మండలంలోని పిప్పల్ ధరి గ్రామానికి చెందిన తొడసం ఆనంద్‌రావుపై శనివారం ఎలుగుబంటి దాడి చేసి గాయపర్చింది. పిప్పల్ ధరి గ్రామ సమీపంలో గల తన చేనులో కోతులను తరిమేందుకు వెళ్లగా ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసేందుకు యత్నించింది. దీంతో అక్కడే ఉన్న ఒక చెట్టును ఎక్కే క్రమంలో ఎలుగుబంటి అతని కాలును పట్టుకుంది. అక్కడే ఉన్న కుక్కలు అరవడంతో పారిపోయింది. కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ముందుగా బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం అదిలాబాద్ లోని రిమ్స్‌కు తరలించారు.

కల్తీ కల్లు సేవించి వ్యక్తి మృతి



విలాస్ (ఫైల్)

తానూరు: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన మోరే విలాస్ (39) కల్తీ కల్లు సేవించి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విలాస్ శనివారం ఉదయం కల్తీ కల్లు సేవించి ఇంటి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ కుప్టి గ్రామానికి వెళ్లి కల్తీకల్లు దుకాణాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా కల్తీ కల్లు అమ్ముతున్న ఆనంద్‌గౌడ్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ శాఖ సీఐ నజీర్ హుస్సేన్‌తో ఫోన్‌లో మాట్లాడి దుకాణాన్ని తొలగించాలని సూచించారు. పూర్తిస్థాయిలో విచరణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. మృతుని భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన ఆనందపు రవితేజ (24) ఇటీవలే ఓ మెడికల్ దుకాణాన్ని ప్రారంభించాడు. దీంతో పాటు ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో పత్తి పంట వేశాడు. ఇందుకు రూ. 5 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. శనివారం చేనుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి పురుగుల మందు తాగాడు. తన స్నేహితుడికి ఫోన్‌చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తల్లి రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో యువకుడు మృతి



రంజిత్ (ఫైల్)

ఖానాపూర్: పట్టణానికి చెందిన తొంటుకూరి సరిత–శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు రంజిత్ (27) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సదరు యువకుడికి మూడురోజుల క్రితం జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినప్పటికీ జ్వరతీవ్రత తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ప్రవళిక, కూతురు (1) ఉన్నారు.


చికిత్స పొందుతూ రైతు మృతి



గజానన్ (ఫైల్)

తాంసి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మహారాష్ట్రలోని నాందేడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన గజానన్ దేశ్‌ముఖ్(32) శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు గజానన్ మరో రైతుతో కలిసి రెండు రోజుల క్రితం పంటచేనులో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు సరిగాలేక బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఘటనలో గజానన్ తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని నాందేడ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



అపస్మారకస్థితిలో సాయికృష్ణ

కుంటాల: మండల కేంద్రానికి చెందిన గంద్ర నర్సింగ్ రావు కుమారుడు గంద్ర సాయికృష్ణ పని నిమిత్తం శనివారం నిర్మల్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై కల్లూరు నుంచి కుంటాల వస్తుండగా వెంకూర్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలోకి చేరడంతో గమనించిన స్థానికులు 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి, డ్రగ్స్ అరికట్టడంలో విఫలం


- పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ




మాట్లాడుతున్న అందె మంగ

ఖానాపూర్: రోజురోజుకూ పెరుగుతున్న నేరాలకు కారణమైన గంజాయి, కల్తీ మద్యం, డ్రగ్స్ అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. శనివారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఏడో మహాసభకు హాజరై మాట్లాడారు. పెరుగుతున్న నేరాలకు పాలకుల వైఫల్యమే కారణమన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతోందని, పనిచేసే చోటే లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. మహిళలపై ప్రతీ రోజు ఎక్కడో ఓ చోట లైంగికదాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో మత్తుకు బానిస అవుతున్నారన్నారు. లైంగిక వేధింపుల చట్టాలు ఉన్నప్పటికీ కేసులు నమోదు చేయడంలో యంత్రాంగం విఫలమవుతోందన్నారు. అంతకుముందు హరిత జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహిళా అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు, నాయకులు మల్లక్క, లావణ్య, చంద్రకళ, రాజేశ్వరి, విజయలక్ష్మి, అనసూయ, సునారికారి రాజేశ్, గోపి, నర్సయ్య, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న ప్రతిమారెడ్డి



పురస్కారం అందుకుంటున్న ఉద్యోగి



పురస్కారం అందుకుంటున్న ఉద్యోగి

ఆదిలాబాద్/నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు ఉద్యోగులు రాష్ట్రస్థాయి ప్రగతి చక్ర పురస్కారాలను అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళా భవన్లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా శనివారం పురస్కారాలు అందుకున్నారు. నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, పీఎంఎస్ కోర్ గ్రూప్ సూపర్ వైజర్ వినోద్ (ఆదిలాబాద్ ఆర్ఎంఒ), ఆపరేషన్ టీమ్ లాజిస్టిక్స్ ఉద్యోగి అబ్దుల్ అన్సార్(ఆదిలాబాద్ డిపో), మెకానిక్ కే.రాజబాబు (ఆదిలాబాద్ ఆర్ఎంఒ), డ్రైవర్లు మహమ్మద్(ఆదిలాబాద్ డిపో), అసదుల్లా (నిర్మల్ డిపో) ఉన్నారు. రాష్ట్రస్థాయిలో పురస్కారం సాధించడం పట్ల రీజినల్ మేనేజర్ సోలోమన్ ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా ఉద్యోగులు సైతం ముందుకు సాగాలని సూచించారు.

ట్రాలీలో 'ట్రాన్స్‌ఫార్మర్'



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు విద్యుత్ అధికారులు పనులు ప్రారంభించారు. అయితే రెండు రోజులుగా ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్ ఫార్మర్‌ను ట్రాక్టర్ ట్రాలీలో పెట్టి ప్రమాదకరంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్